# నమస్తే తెలంగాణ
# నల్లగొండ

8 | నల్లగొండ, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | NALGONDA


## రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

- బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



చందంపేట (దేవరకొండ), ఫిబ్రవరి 8 : రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎఫెక్ట్ ఢిల్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాభవానికి కారణమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పట్టించుకోలేదని, అందుకే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని పేర్కొన్నారు. రేషన్ కార్డులకు మీ సేవ దరఖాస్తుల పేరిట ఇంకెన్నిసార్లు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నారు, కులగణనలో వివరాలు తీసుకున్నారు.. గ్రామ సభల పేరిట డ్రామా చేశారు.. ఇప్పుడు మీ సేవ ద్వారా దరఖాస్తు అనడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. దరఖాస్తులతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. దరఖాస్తులంటూ దగా చేయడం తప్పు.. 14నెలల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు.



మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

## బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల చేరిక

వలిగొండ, ఫిబ్రవరి 8 : మండలంలోని జాలుకాల్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కళ్లెం రాములు తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పైళ్ల శేఖర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు మద్దెల సందీప్‌కుమార్, ముగ్గు మత్స్యగిరి, కళ్లెం వెంకటేశం, కాశీం, భాస్కర్‌రెడ్డి, ముగ్గు వెంకటేశం, మత్స్యగిరి, రమేశ్ పాల్గొన్నారు.

# అటకెక్కిన చేనేత షోరూమ్



- 2023లో కొయ్యలగూడెంలో మాజీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన
- నిధులు కూడా అప్పుడే విడుదల
- పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- పదేపదే విన్నవించినా ఫలితం శూన్యం
- అందుబాటులోకి వస్తే అమ్మకాల పెంపు
- చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు

### మోడర్న్ సేల్స్ షోరూమ్ ఏర్పాటును పట్టించుకోని ప్రభుత్వం

**చేనేత రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చేనేత కార్మికుల సమస్యలను గాలికి వదిలేస్తున్నది. నేతన్నలకు ఆసరాగా నిలిచేందుకు బీఆర్ఎస్ సర్కారులో శంకుస్థాపన చేసిన చేనేత హ్యాండ్లూమ్ మోడర్న్ షోరూమ్ నిర్మాణాన్ని అటకెక్కించింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా షోరూమ్ ఊసే ఎత్తకపోవడంతో ప్రశ్నార్థకంగా మారింది.**

– యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)



కొయ్యలగూడెం గ్రామ పరిధిలో చేనేత మోడర్న్ సేల్స్ షోరూమ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి కేటీఆర్ (ఫైల్)

కొవిడ్ పరిస్థితులు మొదలు చేనేత రంగం కుదేలైంది. చేతి నిండా పని లేక, చేసిన పనికి సరైన డబ్బులు రాక నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. జౌళి రంగంలో రెడీమేడ్ వస్త్ర ఉత్పత్తి వినియోగం పెరుగడంతో చేతివృత్తులను నమ్ముకొని జీవనం సాగించే చేనేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. చేనేత చీరల విక్రయాలు భారీగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో కార్మికులకు ఊతం అందించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెంలో చేనేత మోడర్న్ సేల్స్ షోరూం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పట్లో రూ.95 లక్షలు కూడా మంజూరు చేసింది. తొలుత 10 శాతం మేర 9.5లక్షలు విడుదల చేస్తూ ప్రొసిడింగ్ ఇచ్చింది. చెక్కును డిపాజిట్ చేయగా, డబ్బులు బ్యాంకులోనే మూలుగుతున్నాయి.

#### నిర్మాణాల ప్రారంభం ఎప్పుడో?

2023 జూన్ 6న అప్పటి చేనేత శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా షోరూం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ ప్రక్రియకు అడుగులు పడే సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగా, పట్టించుకునేవారు కరువయ్యారు. పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది దాటినా చేనేత మోడర్న్ షోరూమ్ నిర్మాణాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.

#### నేతన్నలకు ఎంతో ఉపయుక్తం..

నేసిన చీరలను అమ్మి.. ఉపాధి పొందేందుకు నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వెంట చేనేత మోడర్న్ సేల్స్ షోరూమ్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అప్పటి బీఆర్ఎస్ సర్కారు యోచించింది. 370 గజాల్లో మూడు షెటర్లు, ఒక గోదాం నిర్మాణానికి నిర్ణయించింది. షోరూం అందుబాటులోకి వస్తే చీరల అమ్మకాలు పెరిగే అవకాశం ఉంటుంది. కాంట్రాక్టర్ సైతం పనులు ప్రారంభించేందుకు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తున్నా, ప్రభుత్వం నుంచి స్పందన కరువవుతున్నది. చేనేత మోడర్న్ సేల్స్ షోరూమ్ పనులు ప్రారంభించాలని చేనేత కార్మిక సంఘాలు, సొసైటీలు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం ఉండడం లేదు. రాష్ట్ర చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కూడా వినతి పత్రం అందజేశారు. ఇటీవల జౌళి శాఖ కమిషనర్‌ను కూడా కలిసి విన్నవించారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### నిధులు కేటాయించాలి



చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి నిధులు కేటాయించి చేనేత కార్మికులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. కాంప్లెక్స్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసి 10శాతం నిధులు కేటాయించారు. భవన నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నాం. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తే షాపింగ్ కాంప్లెక్స్ పూర్తవుతుంది. దాంతో కార్మికులకు ఉపాధి దొరుకుతుంది.

**- గడ్డం జయశంకర్, కొయ్యలగూడెం చేనేత సహకారం సంఘం ఇన్‌చార్జి చైర్మన్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్

## సూర్యాపేట నుంచే బీసీ ఉద్యమం

- కాంగ్రెస్ సర్కారుపై హత్య కేసు నమోదు చేయాలి
- రాహుల్‌గాంధీ మెప్పు కోసమే కులగణన
- సూర్యాపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కిశోర్

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 8 : రాహుల్‌గాంధీ మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి బీసీ జనాభాను తగ్గించిందని, రాష్ట్రంలో 40లక్షల మంది బీసీలను హత్య చేసిన కాంగ్రెస్ సర్కారుపై హత్య కేసు నమోదు చేయాలని సూర్యాపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మున్నూరు కాపు సంఘం నాయకుడు పుట్ట కిశోర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో మున్నూరు కాపు, బీసీ సంఘాల నాయకులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో మున్నూరుకాపులు 25లక్షల మంది ఉంటే.. ప్రస్తుతం 13లక్షల మందిని చూపించడం అన్యాయమన్నారు. మున్నూరు కాపులు రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతున్నారని, చట్టసభల్లో సీట్లు అడుగుతారని బీసీ కులాలను తగ్గించి చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. 3శాతం ఉన్న ఓసీలు 10శాతానికి పెంచిన ఈ సమగ్ర కులగణన సర్వే తప్పుల తడక అని విమర్శించారు. త్వరలోనే బీసీలు, బీసీ ఉపకులాలు జేఏసీగా ఏర్పడి తమ వాటాపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. రాహుల్‌గాంధీ మెప్పు కోసం తప్పుల తడకగా కుల గణన చేశారు తప్ప.. బీసీలపై ప్రేమతో కాదని అన్నారు. ఈ సర్వే తప్పు అని ప్రభుత్వం ఒప్పుకొని మళ్లీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో సూర్యాపేట నుంచే బీసీ ఉద్యమాన్ని మొదలుపెట్టి రాజ్యాంగబద్ధంగా తమ వాటాను సాధించుకుంటామని అన్నారు. కొందరు బీసీ నాయకులు ముఖ్యమంత్రి అడుగులకు మడుగులు ఒత్తుతూ బీసీలకు అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించడం లేదని పేర్కొన్నారు. మున్నూరు కాపు సభ్యత్వాలే 18లక్షలు ఉంటే.. 13లక్షల 60వేల జనాభా ఎలా ఉంటారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మున్నూరు కాపు కులగణన తామే చేపట్టి వెబ్‌సైట్‌లో పెడుతామని, అలాగే ఇతర కులాలు కూడా తమ కులగణన చేసి వెబ్‌సైట్‌లో పెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం సీనియర్ నాయకులు నల్లకుంట్ల అయోధ్య, డేగల జనార్దన్, దంతాల రాంబాబు, సముద్రాల మనోహర్, గోనె సందీప్, కడియం శ్రీను, గోనె సతీశ్, దంతాల వెంకటేశ్వర్లు, గోనె అశోక్, దంతాల కొండల్ పాల్గొన్నారు.




యాదగిరిగుట్ట: మల్లాపురంలో రిలే దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

## వైద్య కళాశాలను తరలిస్తే ఊరుకోం

- ఎమ్మెల్యే ఐలయ్య స్పందించకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తాం
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 8 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిని వేరే చోటుకు తరలిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామానికి మంజూరైన వైద్య కళాశాల, ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రిలే దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి ప్రాంత యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో వైద్య కళాశాలను మంజూరు చేశారన్నారు. మల్లాపురం గ్రామంలోని వెయ్యి మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సంకల్పించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వైద్య కళాశాల భువనగిరిలో ప్రత్యక్షమైందన్నారు. ఇలానే ఊరుకుంటే కొడంగల్‌కు తరలించుకుపోయే అవకాశం ఉందని తెలిపారు. భువనగిరిలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రారంభమైందని, జాతీయ వైద్య కౌన్సిల్ నిబంధనల ప్రకారం వచ్చే ఏడాది వరకు శాశ్వత భవనాలను నిర్మించకపోతే వైద్య కళాశాల రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్య కళాశాల ఏర్పాటుపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మల్లాపురం గ్రామంలో వైద్య కళాశాల నెలకొల్పితే ఎమ్మెల్యే నిర్ణయించిన వారినే సర్పంచ్, ఎంపీటీసీలుగా ఏకగ్రీవంగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో వైద్య కళాశాల రావడం ఎమ్మెల్యే ఐలయ్య ఇష్టంలేనట్లుగా వ్యవహరిస్తున్నారని, స్థల సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మల్లాపురం గ్రామస్తులు ఏకమై వైద్య కళాశాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉందని ఎస్ఐ ఉదయ్ కుమార్ చెప్పడంతో మధ్యాహ్నం ఒంటి గంటకు దీక్షను విరమించారు. దీక్షలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గౌడ శ్రీశైలం, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఒగ్గు మల్లేశ్, యువజన విభాగం గ్రామ నాయకులు కర్రె శేఖర్, మంత్రి భిక్షపతి, మోట రమేశ్, శేఖర్, నరేందర్, శ్రీనివాస్, సిద్ధులు, శ్రీశైలం, రాజు, హిమామ్, కార్తీక్, రాజశేఖర్, ప్రశాంత్, రాంబాబు, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సోమవారం ప్రజావాణి రద్దు : కలెక్టర్



భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 10న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంత రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని, ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు.





సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

## బడ్జెట్‌లో విద్యకు 20శాతం నిధులు కేటాయించాలి

- సూర్యాపేటలో విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 8 : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టీఎస్ఈసీ) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్ని రంగాలతోపాటు విద్యారంగానికి ప్రాధాన్యమిస్తామని, బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించిందన్నారు. ఇప్పుడు 7శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. అప్పుల కారణంగా ఆర్థిక లోటు ఏర్పడిందని, విద్యకు తక్కువ బడ్జెట్ కేటాయించామని, భవిష్యత్‌లో నిధులు పెంచుతామని ప్రకటించుకున్నారని చెప్పారు. కానీ.. ఎంత శాతం పెంచుతామన్నది చెప్పలేదని, ఈ నెలలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో విద్యకు 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బతి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల వేణు, నాయకులు రేపాక లింగయ్య, వెంకటేశ్వర్‌రావు, వెంకటనారాయణ, రమణ, సింహాద్రి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.




మిర్యాలగూడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

## నిధుల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం

- ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు మట్టయ్య

మిర్యాలగూడ, ఫిబ్రవరి 8 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం సంపన్న వర్గాల కోసమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేంద్రం విభజన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా కేంద్రం ఆటంకాలు సృష్టిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి, సామాజిక వర్గాలకు వ్యతిరేకంగా విద్య, వైద్యం, కనీస అవసరాలను తీర్చే విధంగా కేంద్ర బడ్జెట్ లేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశి, భరత్, మల్లేశ్, సందీప్, జ్యోతి, వినయ్, కమలమ్మ, సాలమ్మ, నాగరాజు, కిరణ్ పాల్గొన్నారు.

## డిగ్రీ సప్లిమెంటరీ విద్యార్థులకు మరో అవకాశం

రామన్నపేట, ఫిభ్రవరి 8 : 2019–20 సంవత్సరానికి ముందు డిగ్రీ చదివి పూర్తి చేయలేక సప్లిమెంటరీ సబ్జెక్టులు కలిగిన విద్యార్థులకు మహాత్మా గాంధీ యూనివర్సిటీ మరో అవకాశం కల్పించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్స్‌పాల్ రహత్‌ఖానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించి మరోసారి పరీక్ష రాయొచ్చని పేర్కొన్నారు.

## 10న డిండి ఐటీఐలో అప్రెంటీస్ మేళా

డిండి, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన కంపెనీల్లో అప్రెంటీస్ చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటీస్ యాక్ట్ ప్రకారం స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ ప్రొఫైల్, సర్టిఫికెట్ల జిరాక్స్ తీసుకొని రావాలని, వివరాలకు సెల్ 9182663839ను సంప్రదించాలని సూచించారు.



## నల్లగొండలో అనన్య సందడి

టాలీవుడ్ సినీ నటి అనన్య నాగిళ్ల శనివారం నల్లగొండలో సందడి చేశారు. పట్టణంలోని ఓ షోరూమ్ ప్రారంభానికి వచ్చిన ఆమెను చూసేందుకు యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె తప్పదు

- ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు వెంకటయ్య



నల్లగొండ ఆర్టీసీ డిపో గేటు వద్ద పోస్టర్ ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 8 : ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోతే జేఏసీ పిలుపు మేరకు ఏ సమయంలోనైనా సమ్మెకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు బాసాని వెంకటయ్య అన్నారు. నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పలువురు కార్మికులు పాల్గొన్నారు. అనంతరం జేఏసీ ప్రచురించిన సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. 2021 వేతన సవరణతోపాటు 2017 వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు వచ్చే సబ్సిడీ ఆర్టీసీ సంస్థకు చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ డింమాడ్లు నెరవేర్చకుంటే సమ్మెకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు ఎన్ఆర్‌సీ రాజు, కార్మిక నాయకులు సత్తయ్య, ఏఎల్ రెడ్డి, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.